క్లుప్తంగా

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగులకు బియ్యం అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలో ఆదివారం నేరేడుచర్ల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనితా క్లబ్ అధ్యక్షురాలు వీరవెల్లి శ్రీలతాకోటేశ్వర్‌రావు ముగ్గురు వికలాంగులకు 25 కేజీల చొప్పున బియ్యాన్ని వాసవీ క్లబ్ డిస్ట్రిక్ క్యాబినేట్ ట్రెజరర్ రాచకొండ విజయలక్ష్మి, అరుణకుమారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, పాలిశెట్టి సంధ్య, కందిబండ శ్రీనివాస్, నటరాజ్, గోపాలకృష్ణ, పరమేశం, మహాలక్ష్మి, ఇందిర, రజిత, అనురాధ, అరుణ, రాధిక, లక్ష్మి, స్వాతి, కళ్యాణి తదితరులు ఉన్నారు.

శ్రీకాంతాచారి త్యాగం మరువలేనిది



శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మునగాల : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరుడైన కాసోజు శ్రీకాంతాచారి త్యాగం మరువలేనిదని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ అన్నారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు జాబ్ కేలండర్ ప్రకటించి నిరుద్యోగ భృతి ప్రకటించాలన్నారు. తెలంగాణలో ఉచిత విద్య, వైద్యం, గృహనిర్మాణం లాంటి అవసరాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సిరికొండ అజయ్, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, రచ్చ ఉపేందర్, మండవ వెంకన్న, తోకల సతీష్, యువకులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దాతలు, నిర్వాహకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం దాతలు బట్టు రమణ, దేవరశెట్టి సురేష్‌లు నిర్వహించారు. 500 మంది మాలధారులు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, బర్మావత్ సీతారాంసింగ్, గడ్డం సూర్యారెడ్డి, రంగా, నాగరాజు తదితరులు ఉన్నారు.

వైభవంగా నారసింహుని నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, మూలవిరాట్‌స్వామికి పంచామృతాభిషేకం జరిపించారు. అదే విధంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్య ధారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో పూజలు

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కోదాడలో కాంగ్రెస్‌కే పట్టం

- అన్ని రౌండ్లలో హస్తం పార్టీదే ఆధిక్యత
- కోదాడ పట్టణంలో అధిక మెజార్టీ



గెలిచిన అనంతరం విజయ సంకేతం చూపుతున్న పద్మావతిరెడ్డి



రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న నలమాద పద్మావతిరెడ్డి

కోదాడ : కోదాడ నియోజకవర్గ ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. కోదాడ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఏ అభ్యర్థి సాధించలేని మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతి రికార్డు స్థాయి విజయాన్ని కైవసం చేసుకున్నారు. కౌటింగ్ ప్రారంభమైన మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు పద్మావతికి మెజార్టీ పెరుగుతూ వచ్చింది. మొత్తం 19 రౌండ్లలో ఏ ఒక్క రౌండ్‌లో కూడా బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ ఆధిక్యతను ప్రదర్శించలేకపోయారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు కోదాడ పట్టణంలోని ఓటర్లు కాంగ్రెస్ పార్టీకే తమ మద్దతునిచ్చారు.

కాంగ్రెస్‌కు 58,172 మెజార్టీ

నియోజకవర్గంలో మొత్తం 2,41,554 మంది ఓటర్లు ఉండగా వీరిలో 2,08,992 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతికి 1,25,783 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌కు 67,611 ఓట్లు వచ్చాయి. దీంతో పద్మావతికి 58,172 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇరు పార్టీలకు కలిపి 1,93,394 ఓట్లు రాగా పోటీలో ఉన్న మిగిలిన 32 మంది అభ్యర్థులు, నోటాకు కలిపి కేవలం 15,598 ఓట్లు మాత్రమే రావడం గమనించదగ్గ విషయం. నోటాకు 887 ఓట్లు వచ్చాయి.

ఓడిన చోటే గెలిచి..

2014లో తొలిసారి ఎన్నికల బరిలో దిగిన పద్మావతి ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌పై 13 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అధికారంలోకి రావడంతో ఆమె ప్రతిపక్ష సభ్యురాలిగా మిగిలిపోయారు. ఆ తరువాత 2018 ఎన్నికల్లో పద్మావతి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయగా, బొల్లం మల్ల య్యయాదవ్ బీఆర్‌ఎస్ తరుపున పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో మల్లయ్యయాదవ్ చేతిలో 756 ఓట్ల స్వల్ప తేడాతో పద్మావతి ఓటమి పాలయ్యారు. ఐదు సంవత్సరాలు తరువాత అదే మల్లయ్యయాదవ్‌ను 59,423 ఓట్ల తేడాతో ఓడించి విజయాన్ని అందుకున్నారు.

కోదాడ పట్టణంలో ఆధిక్యం

పద్మావతిరెడ్డి విజయంలో కోదాడ పట్టణం కీలకంగా మారింది. మునుపెన్నడూ లేనివిధంగా పట్టణంలో కాంగ్రెస్‌కు ఏకంగా 21,236 ఓట్ల మెజార్టీ వచ్చింది. పట్టణంలో కాంగ్రెస్‌కు 30666 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 9430 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో కాంగ్రెస్ మెజార్టీ 21,236గా నమోదైంది. పట్టణంతో పాటు అన్ని మండలాల్లో కాంగ్రెస్‌దే పైచేయిగా నిలిచింది. చిలుకూరు మండలంలో అత్యధిక మెజార్టీ రాగా, నడిగూడెం మండలంలో అతి తక్కువగా మెజార్టీ వచ్చింది. మోతెలో కాంగ్రెస్‌కి 17,691 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 12,159 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 5532 ఓట్ల మెజార్టీ వచ్చింది. మునగాల మండలంలో కాంగ్రెస్‌కు 17,493, బీఆర్‌ఎస్‌కు 11,276 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 6217 ఓట్ల మెజార్టీ వచ్చింది. చిలుకూరు మండలంలో కాంగ్రెస్‌కి 16,944, బీఆర్‌ఎస్‌కు 9197 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 7747 ఓట్ల మెజార్టీ నమోదు అయింది. అనంతగిరి మండలంలో కాంగ్రెస్‌కు 12,865 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 8168 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీకి 4697 ఓట్లు పోల్ అయ్యాయి. కోదాడ పట్టణంలో కాంగ్రెస్‌కు 30,666 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 9430 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 21,236 మెజార్టీ వచ్చింది. కోదాడ మండలంలో కాంగ్రెస్‌కు 16,655 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 9095 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 7560 ఓట్ల మెజార్టీ వచ్చింది. నడిగూడెం మండలంలో కాంగ్రెస్ పార్టీకి 11,796 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 7779 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీకి 4017 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్‌కు 1673 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 507 రాగా, కాంగ్రెస్‌కు 1166 ఓట్లు మెజార్టీ వచ్చింది.

కోదాడ నియోజకవర్గంలో అభ్యర్థులకు పోలైన ఓట్ల వివరాలు

నలమాద పద్మావతి (కాంగ్రెస్ పార్టీ)	1,25,783	ఎస్.అఖిల్ (సోషల్ జస్టిస్ పార్టీ)	374	పిట్టల సైదులు	23
బొల్లం మల్లయ్యయాదవ్ (బీఆర్ఎస్)	67,611	ఇండిపెండెంట్ అభ్యర్థులు..		బాదే శ్రీవిద్య	31
పిల్లుట్ల శ్రీనివాస్ (బీఎస్పీ)	3369	వెంకటరమణ	918	బెల్లంకొండ నవీన్	69
మట్టిపల్లి సైదులు (సీపీఎం)	1195	కొమ్ము రమేష్	257	ఎం. రామకృష్ణ	41
రవినాయక్ (బ్లూ ఇండియా పార్టీ)	90	కొల్లు లక్ష్మీనారాయణ	1009	ఎం. గౌతమి	36
సోమయ్య(మార్కిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా)	215	జి.సైదులు	597	ఎం. భవాని	63
ఎం.ఆంజనేయులు (ఏఐఎఫ్‌బీ)	340	కోటిరెడ్డి	318	కందుల మురళి	219
మేకల సతీష్‌రెడ్డి (జనసేన)	2151	గుండు ఉపేందర్	361	ఆర్. సుమన్	115
సైదాబాబు (ధర్మ సమాజ్ పార్టీ)	173	లింగయ్య	77	షేక్. మస్తాన్ సాహెబ్	349
ఎల్. వెంకటేశ్వర్లు (ప్రజావాణి)	171	ప్రేమ్‌కుమార్	87	ఎస్. సుధాకర్‌రెడ్డి	427
చేకూరి మల్లయ్య (ఏడీఆర్‌పీ)	1044	తండు ఉపేందర్	169	సుంకర లింగారెడ్డి	109
అబ్దుల్ మాలిక్ (జీసీవైపీ)	268	రామకృష్ణయాదవ్	46	నోటా	887

నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బయోడేటా

పేరు : ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
పుట్టిన తేదీ : 20 జూన్ 1962
తల్లిదండ్రులు : ఉషాదేవి, పురుషోత్తంరెడ్డి
భార్య : పద్మావతి, ఎమ్మెల్యే కోదాడ.
విద్య : నేషనల్ డిఫెన్స్ అకాడమీ నుంచి గ్రాడ్యుయేషన్ (సీనియర్ కమర్షియల్ పైలట్ లైసెన్స్ హోల్డర్)
గత అనుభవం : భారత రాష్ట్రపతికి ఏడీసీ, కంట్రోలర్‌గా పనిచేశారు. (రాష్ట్రపతి భవన్‌లో ప్రతిష్టాత్మకమైన శాశ్వత ఉద్యోగానికి రాజీనామా చేసి 1994లో కాంగ్రెస్ పార్టీలో చేరారు)
ప్రస్తుతం : నల్లగొండ, పార్లమెంట్ సభ్యుడిగా ఉండి హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా మళ్లీ గెలుపొందారు.
గతంలో : 5 సార్లు (కోదాడలో 2 సార్లు, హుజూర్‌నగర్‌లో 3 సార్లు)ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో గృహనిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, టీపీసీసీ ప్రెసిడెంట్‌గా పని చేశారు. ఏపీ శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. చైర్మన్, అంచనాల కమిటీ, ఏపీ శాసనసభ చైర్మన్, ఎక్స్ సర్వీస్‌మెన్ సెల్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ. ఎయిర్‌ఫోర్స్‌లో ఫైటర్ పైలట్‌గా పనిచేశారు. ఫ్రంట్‌లైన్ ఫైటర్ స్క్వాడ్రన్‌లో మిగ్ – 21, మిగ్ – 23 విమానాలను నడిపారు. భారత వైమానిక దళంలో సియాచిన్, పాకిస్థాన్, చైనా సరిహద్దుల్లో సేవలందించారు.
సభ్యులు : మాజీ సైనికుల పునరావాసం కమిటీ, ఏపీ ప్రభుత్వం. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సమస్యపై 5 జనవరి 2010 , 6 జనవరి 2011లలో కేంద్ర హోం మంత్రి నిర్వహించిన అఖిలపక్ష సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహించారు.

నలమాద పద్మావతిరెడ్డి బయోడేటా

పేరు : నలమాద పద్మావతిరెడ్డి
భర్త : నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
వయస్సు : 53 సంవత్సరాలు
చదువు : బీఈ, ఆర్కిటెక్చర్, జేఎన్‌టీయూ, హైదరాబాద్
వృత్తి : ఇంటీరియర్ డిజైనర్
రాజకీయ ప్రస్థానం : కోదాడ అసెంబ్లీ స్థానం నుంచి 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా కోదాడలో పోటీ చేసి 756 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 2019లో హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా కోదాడ నుంచి భారీ విజయం సాధించారు.

కౌంటింగ్ ప్రశాంతం

- ఉదయం 8గంటలకే ప్రారంభమైన లెక్కింపు
- అభ్యంతరాలు, ఇబ్బందులు లేకుండా సాగిన ప్రక్రియ
- మొదటగా హుజూర్‌నగర్, చివరగా కోదాడ ఫలితాలు వెల్లడి



ఈవీఎంలు లెక్కిస్తున్న కౌంటింగ్ సిబ్బంది

సూర్యాపేట: జిల్లా వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం చేపట్టిన అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8గంటలకే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ఈ ప్రక్రియను ప్రారంభించారు. 8.30గంటలకు నాలుగు నియోజకవర్గాల ఈవీఎంల లెక్కింపును చేపట్టారు. ఈ ప్రక్రియను కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంకతో పాటు ఎన్నికల అబ్జర్వర్లు పర్యవేక్షించారు. కౌంటింగ్ ప్రక్రియ ఎలాంటి అభ్యంతరాలు, ఇబ్బందులు లేకుండా సాగింది. ఈవీఎంలు మొరాయించడం లాంటి ఇతర సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాలేదు. అయితే కోదాడ నియోజకవర్గానికి సంబంధించిన ఫలితాల వెల్లడి నెమ్మదిగా సాగింది.

పోలింగ్ కేంద్రాల వారీగా కౌంటింగ్..

ప్రతి నియోజకవర్గంలో మొదటి పోలింగ్ కేంద్రం నుంచి చివరి పోలింగ్ కేంద్రం వరకు వరస క్రమంలో కౌంటింగ్ ప్రక్రియ చేపట్టారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 308 కేంద్రాలకు 18 టేబుళ్లను ఏర్పాటు చేసి 18 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. కోదాడ నియోజకవర్గంలోని 296 పోలింగ్ కేంద్రాలకు 16 టేబుళ్లను ఏర్పాటు చేసి 19 రౌండ్లలో కౌంటింగ్ చేపట్టారు. సూర్యాపేట నియోజకవర్గంలోని 271 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుళ్ల ఏర్పాటు చేసి 20 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించారు. అదేవిధంగా తుంగతుర్తి నియోజకవర్గంలోని 326 పోలింగ్ కేంద్రాలకు 18 టేబుళ్లను ఏర్పాటు చేసి 18 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించారు. ఇందులో హుజూర్‌నగర్ ఫలితం మొదటగా వచ్చింది. తర్వాత తుంగతుర్తి, సూర్యాపేట, చివరగా కోదాడ ఫలితాలు వెలువడ్డాయి.

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

సాధారణ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు సహకరించిన సిబ్బంది, ప్రజలకు కలెక్టర్ వెంకట్రావ్ ధన్యవాదాలు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి చేశామని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు.

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు

మునగాల: సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం అండర్ -14, 17 క్రీడాకారులకు ఉమ్మడి నల్ల గొండ జిల్లాస్థాయి షూటింగ్ బాల్, టెన్ని కాయిట్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు సూర్యాపేట జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ ఆజాంబాబా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం కోదాడ పట్టణంలోని న్యూవిజన్ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు, బుధవారం సూర్యాపేట పట్టణంలోని స్వామి నారాయణ పాఠశాలలో స్కేటింగ్, సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని ఆజాంబాబా కోరారు. వివరాలకు 99122 96412 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

హుజూర్‌నగర్‌లో ఉత్తమ్ హవా



ఫలితాల అనంతరం ధ్రువీకరణ పత్రంపై సంతకం చేస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : ప్రస్తుత సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌గనర్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎంపీ కెప్టెన్ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, అధికార బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిపై 44,888 ఓట్ల ఆధిక్యం సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈ ఎన్నికల్లో ఉత్తమ్‌కు 1,16,707 ఓట్లు రాగా శానంపూడి సైదిరెడ్డికి 71,819 ఓట్లు వచ్చాయి. లెక్కింపు అనంతరం రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఓట్ల లెక్కింపు పరిశీలకులు హిందోల్‌దత్త, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే సమక్షంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన ధ్రువపత్రాన్ని ఉత్తమ్ కుమార్‌రెడ్డికి అందజేశారు.

తొలి రౌండ్ నుంచే ఆధిక్యం

కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తొలి రౌండ్ నుంచే ఆధిక్యం సాధించారు. ఉత్తమ్ తన సమీప ప్రత్యర్థి శానంపూడి సైదిరెడ్డిపై ప్రతి రౌండ్‌కు దాదాపు 2 వేల ఆధిక్యం ప్రదర్శించారు. పోస్టల్ బ్యాలెట్‌లో కూడా ఆధిక్యం సాధించి 44,888 ఓట్ల మెజార్టీతో ఉత్తమ్ విజయబావుటా ఎగురవేశారు. కాగా, నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,47,592 కాగా 2,15,298 ఓట్లు పోలయ్యాయి. వాటిలో ఉత్తమ్‌కు 1,16,707 ఓట్లు రాగా సైదిరెడ్డికి 71,819 ఓట్లు వచ్చాయి. 44,888 ఓట్ల మెజార్టీతో ఉత్తమ్ ఘన విజయం సాధించారు.

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అభ్యర్థులకు పోలైన ఓట్ల వివరాలు

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్)	1,16,707	అంజనపల్లి రవి	849
శానంపూడి సైదిరెడి (బీఆర్ఎస్)	71,819	చీకూరి లీలావతి	118
పిల్లుట్ల రఘు (ఏఐఎఫ్‌బీ)	8,280	బానోతు నాగేశ్వరరావు	134
చల్లా శ్రీలత (బీజేపీ)	3,715	పిన్నాని సంపత్‌కుమార్	164
తిమ్మారెడ్డి సైదిరెడ్డి (ఏడీఆర్‌పీ)	2,333	పోతురాజు విజయ్	1,060
మల్లు లక్ష్మి (సీపీఎం)	1,914	బండారు నాగరాజు	1,269
రాపోలు నవీన్ కుమార్ (బీఎస్‌పీ)	1,481	బాదె నర్సయ్య	142
అవిరెండ్ల జ్యోతి (డీఎస్‌పీ)	370	డాక్టర్ మేడి రమణ	266
నందిపాటి జానయ్య (టీఎస్‌పీ)	491	జి.రవినాయక్	410
పిల్లలమర్రి లావణ్య (పీపీఐ)	101	కె.వెంకటేశ్వర్లు	381
వస్కుల సైదమ్మ (ఎంసీపీఐ (యూ)	124	మచ్చా సందీప్	146
ఇండిపెండెంట్ అభ్యర్థులు..		డాక్టర్ డి.సాంబశివగౌడ్	404
చిలకల రాంబాబు	1,777	నోటా	843

కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీలో ఉద్రిక్తత

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం కిష్టాపురంలో ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తలు చేపట్టిన విజయోత్సవ ర్యాలీలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాంగ్రెస్ నాయకుల విజయోత్సవ ర్యాలీ జెడ్పీటీసీ చంద్రకళాసైదిరెడ్డి నివాసం వద్దకు చేరుకోగానే కొందరు ఆమె ఇంటిపై రాళ్లు రువ్వడంతో అద్దాలు ధ్వంసమై ముగ్గురికి గాయాలయ్యాయి. ఇంటి వద్ద ఉన్న కుర్చీలను విరగ్గొట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కాంగ్రెస్ కార్యకర్తలను చెదరగొట్టారు. కోదాడ డీఎస్పీ ప్రకాష్, రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల విజయోత్సవం



హుజూర్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



చిలుకూరులో డ్యాన్స్ చేస్తున్న కాంగ్రెస్, సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజయఢంకా మోగించడంతో ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఇందిరా సెంటర్‌లో బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, కౌన్సిలర్ కోతి సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పిట్టల రవి, ఐల వెంకన్న, గంజి శివ తదితరులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించడం పట్ల మండల పరిధిలోని గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ఘనంగా సంబరాలు నిర్వహించుకున్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, రేపూరి వెంకటాచారి, ఇర్ల సీతారాంరెడ్డి, అమరనేని వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, పాపిరెడ్డి, సాధినేని అప్పారావు, మండలపు శేషు, నర్సింహారెడ్డి, సుమన్‌రెడ్డి, నాన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : రాష్ట్రంలో, కోదాడలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో ఆదివారం చిలుకూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చారు. స్వీట్లు పంచారు.

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని వేపలసింగారం, కరక్కాయలగూడెం తదితర గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు ముడెం గోపిరెడ్డి, మచ్చా వెంకటేశ్వర్లు, పార్టీ మండల అధ్యక్షుడు చక్కెర వీరారెడ్డి, ఎన్ఆర్ఐ సాములు జైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడలో కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతి విజయం సాధించడం, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లు గెలిచి ప్రభుత్వం చేయబోతుండటంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం నడిగూడెం మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచిన పద్మావతికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : హుజూర్‌నగర్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలపొందడం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. గ్రామాల్లో ర్యాలీలు తీసి నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మునగాల : కోదాడలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతి భారీ మెజార్టీతో విజయం సాధించడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుండడంతో ఆదివారం మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సంబరాలు జరుపుకున్నారు.

గరిడేపల్లి : అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ రంగనాథ్, ఆషారమేష్, నర్సిరెడ్డి, చంద్రయ్యగౌడ్, సీతారాంరెడ్డి, రామాంజిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మోతె : కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌పై 58 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా మోతె మండలంలో నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు.

మఠంపల్లి : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడాన్ని హర్షిస్తూ ఆదివారం మండల వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి, ర్యాలీ నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు.



కోదాడరూరల్ : రామలక్ష్మీపురంలో..



నడిగూడెంలో..



గరిడేపల్లిలో..



కోదాడరూరల్ : తొగర్రాయిలో..



మేళ్లచెరువు : రేవూరులో..



మునగాల: కలకోవలో..



మునగాల : ఆకుపాములలో..



హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో..



మఠంపల్లిలో..



మోతెలో..